తెలుగు సంచలనం
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

బుధవారం
1 జూలై 2026

## విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి



**రాజపేట, జూన్ 30(సంచలనం న్యూస్)** మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన రైతు దయ్యాల చంద్రయ్యకు చెందిన పాడి ఆవు మంగళవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురికావడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో తనకు సుమారు రూ.1 లక్ష మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పాడి ఆవు మృతితో కుటుంబ జీవనోపాధికి తీవ్ర దెబ్బ తగిలిందని పేర్కొంటూ, ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు చంద్రయ్య కోరాడు. స్థానిక రైతులు కూడా బాధిత కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

## కానాయిపల్లిలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహణ




**వనపర్తి , జూన్ 30(సంచలనం న్యూస్):** వనపర్తి జిల్లా, కొత్తకోట మండలంలోని కానాయిపల్లి గ్రామంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శిరీష అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చింతకుంట విశ్వం బాబు, ద్యారపోగు వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చింతకుంట విశ్వం బాబు మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, మానవ గౌరవం వంటి ప్రాథమిక హక్కులపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలని అన్నారు. హక్కులకు భంగం కలిగితే చట్టపరమైన మార్గంలో న్యాయం పొందాలని సూచించారు. దళితుల భూ సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని, విద్య ద్వారానే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థులకు పిలుపునిచ్చారు. యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని కోరారు. ద్యారపోగు వెంకటేష్ మాట్లాడుతూ, ప్రతి నెల చివరి రోజున నిర్వహించే పౌర హక్కుల దినోత్సవం ద్వారా రాజ్యాంగ హక్కులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యమని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, దాడులు, అవమానకర ప్రవర్తన చట్టరీత్యా శిక్షార్హమని చెప్పారు. కులమత భేదాలకు అతీతంగా ప్రతి వ్యక్తిని సమానంగా గౌరవించాలని, భూ ఆక్రమణలు లేదా దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యను అభ్యసించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని, సోదరభావంతో కూడిన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట ఎస్సై శివానంద్ గౌడ్, గ్రామ కార్యదర్శి రాజు, గ్రామపంచాయతీ అధికారి ఉషోదయ, సోషల్ వెల్ఫేర్ అధికారి సంతోష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బస్వాపురం పూర్వ విద్యార్థుల ఉదారత

- చిన్నారుల భవిష్యత్తుకు ఆర్థిక సాయం
- విద్యార్థులను అభినందించిన టీచర్లు, గ్రామ ప్రజలు



**భువనగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 30(సంచలనం న్యూస్):** భువనగిరి మండలం, బస్వాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2012--13 వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మానవత్వంతో తల్లి లేని చిన్నారులకు ఆర్థిక సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని ముత్తిరెడ్డి గూడెంకు చెందిన గంగాదేవి జ్యోతి ఇటీవల మృతి చెందారు. ఆమెకు కుమార్తె నందిత, కుమారుడు ఉన్నారు. తల్లి మరణంతో చిన్నారులు అనాధలైనారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బస్వాపురం గ్రామంలో 2012-13 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు నందిత పేరుమీద పోస్టాఫీస్ లో కిసాన్ వికాస్ పత్రం (కే వీ పీ) కింద రూ.70 వేల రూపాయల స్థిర పెట్టుబడి (ఎఫ్ డీ) చేశారు. ఈ ఆర్థిక సాయం ద్వారా భవిష్యత్తులో నందిత ఉన్నత చదువులకు ఉపయోగపడుతుందని విద్యార్థులు అన్నారు. ఈ సందర్భంగా 2012-13 పదవ తరగతి చదివిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, బాలల హక్కుల సంఘం నాయకులు అభినందించారు.

## ప్రతి జర్నలిస్ట్ కి అండగా ఉంటాం

- జర్నలిస్ట్ అనిల్ ని పరామర్శించి, రూ.5వేల ఆర్థిక సహాయం
- అందజేసిన తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్



**బీబీనగర్, జూన్ 30(సంచలనం న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ మండల పరిధిలోని రహీంఖాన్ గూడ గ్రామ చెందిన తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి మంచాల అనిల్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు మొహమ్మద్ షానూర్ వారిని పరామర్శించి 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి జర్నలిస్ట్ కి తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ తరుపున అండగా ఉంటామని అన్నారు. రోడ్డు ప్రమాదంలో గురైన జర్నలిస్ట్ అనిల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బక్కన్న నర్సింహా, జిల్లా సభ్యులు సంకూరి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి
వ్యకాస జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య
సీపీఎం ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా
వినతిపత్రం సమర్పణ




**రామన్నపేట, జూన్ 30(సంచలనం న్యూస్):** రామన్నపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, మండల వ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం మండల విద్యాధికారి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య మాట్లాడుతూ గత పది రోజులుగా సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల అధ్యయనం చేశారు. మండల వ్యాప్తంగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, అదనపు తరగతి గదులు, ఫర్నిచర్, విద్యుత్, పరిశుభ్రత వంటి కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. మండలంలోని అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చాయని, పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా పేరుతో తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు ప్రైవేట్ పాఠశాలలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించి ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటి సభ్యులు బల్గురి అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి నగేష్, మండల కమిటి సభ్యులు గొరిగే సోములు, నాగటి ఉపేందర్, బావండ్లపల్లి బాలరాజు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివ కుమార్, వ్యకాస మండల అధ్యక్షుడు మేడి ముకుంద, పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శానాగొండ రాము, నాయకులు నాగటి లక్ష్మణ్, అప్పం సురేందర్, బావండ్లపల్లి సత్యం, జల్లెల మల్లేష్, అప్పం అభిరుప్, తుర్కపల్లి లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు ప్రజాపాలన అధిపతి జి.చిన్నారెడ్డికి వినతి పత్రం
- అందజేసిన విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్. అశోక్



**హైదరాబాద్, జూన్ 30(సంచలనం న్యూస్):** వికలాంగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని హైదరాబాదులోనీ బేగంపేట ప్రజా పాలన అధిపతి చిన్నారెడ్డిని కలసి వినతి పత్రం అందజేశారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై అదేవిధంగా ఉద్యోగ ఉపాధి అంశాలపై దివ్యాంగుల విశ్వవిద్యాలయాల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్ అశోక్ పలు అంశాలపై ఒక గంట సమయం వివిధ విషయాలపై చర్చించారు. ఈ విషయాలపై చిన్నారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ దివ్యాంగులకు విద్యా ఉద్యోగం ఉపాధి కల్పించుటకు ముఖ్యమంత్రితో చర్చిస్తానని అదేవిధంగా దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేసి రాష్ట్రంలో దివ్యాంగుల అభ్యుదయ నికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల ఫోరం రాష్ట్ర సహాయ కార్యదర్శి చిత్తలూరు వేణు గౌడ్, మందల సైదులు యాదవ్, భువనేశ్వర్, విశ్వవిద్యాలయాల రాష్ట్ర అధ్యక్షురాలు దొరపల్లి దనమ్మ, అరుణ, ఇందిర, సమీరా, సమీనా బేగం, తదితరులు పాల్గొన్నారు.

## లోయపల్లి--సలిగుట్ట తండా

## రహదారి పనులు మధ్యలో నిలుపు

కాలనీవాసుల ఇబ్బందులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 30(సంచలనం న్యూస్)** .లోయపల్లి నుంచి సలిగుట్ట తండాకు వెళ్లే మార్గంలో ఎస్సీ వాడ వద్ద చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి అధ్వానంగా మారడంతో రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై బీజేపీ 76వ బూత్ అధ్యక్షులు ప్రకాష్ ప్రజాపతి స్పందిస్తూ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

## పాఠశాల రంగుల కోసం

## ఐదు నెలల గౌరవ వేతనం విరాళం

- శభాష్ మధు అంటూ ప్రశంశల వర్షం



**రాజాపేట, జూన్ 30(సంచలనం న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు ముందుకు వస్తే విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించవచ్చని రాజాపేట గ్రామ సర్పంచ్ కోయ మధు తన ఐదు నెలల గౌరవ వేతనం రూ.32500 రాజాపేట మండల ప్రాథమిక పాఠశాలకు రంగులు వేయడానికి అందించి శభాష్ సర్పంచ్ మధు అనిపించుకున్నారు. ఎన్నికల సమయంలో తన బస్తీ పాఠశాల విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం పాఠశాల భవనానికి పూర్తిస్థాయిలో పెయింటింగ్ వేయించేందుకు తన గౌరవ ఐదు నెలల గౌరవ వేతనం చెక్కును మండల విద్యాధికారి చంద రమేష్ సమక్షంలో పాఠశాల ఉపాధ్యాయులు భాస్కర్ కు అందజేసి విద్యాభివృద్ధిపై తన నిబద్ధతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, వార్డు సభ్యుడు సట్టు రవీందర్, గాండ్ల నర్సింగరావు, చల్మలపల్లి లక్ష్మణ్, సంగెం వేణు తదితరులు పాల్గొని ఘనంగా సన్మానించి సుభాష్ సర్పంచ్ అని మధు సేవాభావాన్ని అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోయ మధు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. గ్రామంలోని ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందేలా పాఠశాల అభివృద్ధి కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని స్పష్టం చేశారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, దాతలు కలిసి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేయూతనిస్తే విద్యార్థుల భవిష్యత్తు మరింత ప్రకాశవంతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మండల విద్యాధికారి చందా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఆదర్శప్రాయమని కొనియాడారు. సర్పంచ్ కోయ మధు చేసిన సహాయం ఇతర ప్రజాప్రతినిధులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం అందరూ ఇదే విధంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## వనపర్తి జిల్లాలో ఇద్దరు ఏఎస్సైలకు ఘన వీడ్కోలు






**వనపర్తి, జూన్ 30(సంచలనం న్యూస్):** పోలీసు శాఖలో విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన వనపర్తి పట్టణ మహిళ ఏఎస్సై శివపార్వతి, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై ప్రభాకర్ రెడ్డికి జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా ఎస్పీ సునిత రెడ్డి కార్యక్రమానికి హాజరై ఇద్దరినీ శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం కేవలం ఉపాధి కాదని, సమాజ భద్రత కోసం చేసే బాధ్యతాయుతమైన సేవ అని పేర్కొన్నారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏఎస్సై స్థాయికి ఎదిగిన శివపార్వతి, ప్రభాకర్ రెడ్డి ప్రయాణం యువ పోలీసులకు ఆదర్శమని అన్నారు. ప్రభాకర్ రెడ్డి 1989లో, శివపార్వతి 1998లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుళ్లుగా సేవలు ప్రారంభించి క్రమశిక్షణ, పట్టుదలతో పదోన్నతులు పొందారని చెప్పారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల్, వనపర్తి ప్రాంతాలతో పాటు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోనూ విధులు నిర్వహిస్తూ విశిష్ట సేవలు అందించినట్లు తెలిపారు. పదవీ విరమణ ఉద్యోగానికి మాత్రమేనని, సేవాభావానికి కాదని పేర్కొంటూ విశ్రాంతి జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందించే జీపీఎఫ్, ఇన్సూరెన్స్ తదితర పదవీ విరమణ ప్రయోజనాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం అందాల్సిన అన్ని ఆర్థిక ప్రయోజనాలు, బకాయిలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, కార్యాలయ ఏఓ సునంద, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, వనపర్తి పట్టణ ఎస్సై హరిప్రసాద్, గోపాల్పేట ఎస్సై శశిధర్, పోలీసు అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ ను సన్మానించిన ఇంజ మహేష్ మాదిగ



**రాజాపేట, జూన్ 30 (సంచలనం న్యూస్):** రాజపేట మండల నూతన తహసిల్దార్ జి.రవికుమార్ పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం రాజపేట తహసిల్దార్ కార్యాలయంలో. ఎంఈఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఇంజ మహేష్ మాదిగ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రామగళ్ళ కృష్ణ, ఇంజ శ్రీరాములు, ఇంజ ఎలేందర్, చేర్యాల చందు తదితరులు పాల్గొన్నారు.

Publisher & Owner by Reesaanvi Media House, H.No: 6-25, Kothagudem, Ramannapet, Yadadri Bhuvanagiri- 508113, Chief Editor: Bathula Ganesh.
H.No: 6-25, Kothagudem, Ramannapet, Yadadri Bhuvanagiri- 508113, Regd. No: TS-30-0043998, Email: sanchalanamnewsdesk@gmail.com, Cell: 9177108128